# చిట్టెయ్య లాయల్టీ

"నే నేను"



మా యింటికి రెండు గడపలు దాటితే చిట్టెయ్య ఇల్లు. చిట్టెయ్యకు నాకు స్నేహం. అతను నాకన్నా పెద్దవాడే ననుకోండి. చదువుకోని వాళ్లల్లో వయస్సులో తారతమ్యం ఉన్నా స్నేహానికభ్యంతరం ఉండదు. చిట్టెయ్యకు నలభయిఏళ్లు, నాకు యిరవైఅయిదు ఏళ్లు. నేను బి. ఏ. ప్యాసయి నాలుగేళ్లయ్యింది. ఎన్ని తికమకలు పడ్డా ఉద్యోగం కుదిరిచచ్చిందికాదు. కాలమేమో గడిచింది కాదు. ఉద్యోగం లేనివాళ్లకి చీట్లపేకాడేటందుకు ఎవళ్ళో ఒకళ్లు ఉండాలి. నేను మా పేటంతా తిరిగేస్తే పనీపాట లేనివాడు చిట్టెయ్య ఒకడు దొరికాడు. చిట్టెయ్యకు నాకు క్రమంగా అతుక్కుంది. చిట్టెయ్య చిన్నప్పుడు ఒక్కొక్క క్లాసుకు రెండుమూడు బొల్తాల చొప్పున ఫోర్తుఫారందాకా డేకాడు. అక్కడ గొడ్డు చచ్చుబడ్డది. బుద్ధులు భూము లేలుతూంటే కర్మం గాడిదలని కాచిందని, మా చిట్టెయ్యకు బుద్ధులకేమీ తక్కువలేదు. చిట్టెయ్యకు నాలుగువ్రేళ్ళూ లోపలికి పోవడానికి తగినంత ఆస్తిఉంది. నాకో అదీలేదు. అందుచేత చిట్టెయ్యకు నన్నుచూస్తే కొంచెము లోకువ. నాదగ్గర అప్పుడప్పుడూ దర్జా పోతూఉంటాడు. కాని అతనికప్పుడు నేను బి. ఏ. ప్యాసయినానని జ్ఞాపకం వస్తుంది. అప్పుడు మాత్రం కొంచెము గౌరవంగా ఉంటాడు. తక్కినప్పుడు నామీద చలాయిస్తాడు. నాకు ఢిక్కా మొక్కా. ఛీ! పోరా! అంటే చీట్లపేకకు కూడా మొఖము వాయాలని అట్లాగే అంటిపెట్టుకొని వస్తున్నా. చిట్టెయ్య ఒక్కొకప్పుడు తను యం. ఏ. ప్యాసయినాననుకుంటాడు. తానే లెజిస్లేటివ్ కౌన్సిలు మెంబరనుకుంటాడు. నాతో అప్పుడప్పుడంటాడు కదా "మీకు హైకోర్టు జస్టిసుకు సిఫార్సు ఉత్తరంవ్రాసి యిస్తాను వెళ్లండి" అని. అసెంబ్లీ మెంబర్లను, హైకోర్టు జడ్జీలను, హోం మెంబర్లను, వీళ్లనందరిని గారు గీరు లేకుండా తన స్నేహితులకు మల్లే అంటాడు. అబ్బో! వాడి పోకిళ్లు. ఇక ప్రొద్దు గ్రుంకితే మూడు మొదలు నాలుగింటిదాకా జుట్టుకి సంస్కారం చెయ్యడంతోనే సరిపోతుంది. నాలుగింటికి చచ్చి చెడి చాయంగల విన్నపములై బైటికి వస్తాడు. టక్కు టక్కుమని కలెక్టరువలె వెళుతూంటే వెధవడలాయతెల్లే నేను ప్రక్కన నడవడం. చిట్టెయ్య అటూ యిటూ చూడడు. అప్పుడే వోడదిగిన దొరల్లే అదే పోవటం. చిట్టెయ్య తత్వం తెలిసిన వాళ్లు దారెమ్మట పోతూంటే నవ్వుతూ ఉంటారు. చిట్టెయ్య వాళ్లవంక చూస్తేగా. సూటిగా వెళితే బయలుదేరిన చోటికే మళ్లీ వస్తామన్నంత సూటిగా వెళతాడు. ఇదంతా పీఠిక. కథకుమాత్రం పీఠికలుండకూడదా ఏమిటి?

ఇక అసలు కథ. గవర్నరుగారు వస్తారని ఊళ్ళో పుకారు పడ్డది. రోడ్లమీద తారుపొయ్యడం మొదలుపెట్టారు. పెంట రోడ్లన్నీ బాగుచేసి సున్నపురాళ్లు సోల్పుగా పెట్టడం మొదలుపెట్టారు. అది అందం అంట. ఇదంతా చూచాడు చిట్టెయ్య. ఒకరోజున చీట్లపేక ఆడడానికి వెళ్లా. ఉద్యోగం అడగడానికి వెళ్లిన వానిని శిరస్తాదారుకు మల్లే నన్ను ఘంటసేపు వాకిట్లో కూర్చోబెట్టాడు. ఈలోపుగా ఒకటి రెండుసార్లు వాకిట్లోకి వచ్చాడు. నన్ను చూచాడు కాని పలకరించలా. ఏదో మహాకార్యం భుజాన వేసుకొని తిరుగుతూన్నట్లు అటూ యిటూ కాకిచూపులు చూచి లోపలికి వెళ్లాడు. "ఛీ! మనరోజులు మంచివి కావ"ని యింటికి వెళ్లా. మర్నాడు ప్రొద్దున చిట్టెయ్య బజారులో బడి "ఏమండోయి! రంగారావుగారూ!" అని పిలిచాడు; వెళ్లా. "నిన్న సాయంకాలము మీరు వచ్చారల్లే ఉంది. గవర్నరు వస్తున్నాడండి. ఏదో కొంచెం ఆవిషయంలో పనిమీద ఉన్నాను. ఏమనుకోకండి" అన్నాడు. ఏమి పనియా అని ఆలోచించాను. పొడకట్టింది కాదు.

అడుగుదామనుకున్నాను. ఇంతలో ఆయనే మళ్లీ యిట్లా అన్నాడు. "ఏమీ లేదండి! డిన్నరుకు నాకు ఎట్లాగో యిన్విటేషను వస్తుంది. అప్పటికి నల్లసూటులో వెళ్లాలి. ఆ సూటు దేనితో కుట్టించాలా అని ఆలోచిస్తున్నాను. నల్లని బ్లేజరు కుట్టించనా, ఆల్పాకా కుట్టించనా లేక సిల్కు కుట్టించనా అని ఆలోచిస్తున్నాను" నేను నవ్వు ఆపుకొని, "ఆలోచన తెగించండి" అన్నాను. చిట్టెయ్యా ఆక్షేపిస్తున్నా తెలిసికోలేనంత తెలివిగల మనిషి. చివరకి చిట్టెయ్యా అన్నాడు "సిల్కు కుట్టించడానికే నిర్ణయించాను. డబ్బు మా అమ్మదగ్గరనుంచి రావాలి. ఆవిడేమో రేపు బియ్యపు బస్తాకి డబ్బు కావలెనంటూంది." నేను "బియ్యపు బస్తా మాట దేవుడెరుగు. బియ్యపు బస్తా యింట్లోకి వచ్చినా డిన్నరే గదా. ఆ డిన్నరే అక్కడ జరుగుతుంనాయెను. ఈ డబ్బుతో సూటు కుట్టించవచ్చు నన్నాను. చిట్టెయ్యా 'క్వైట్ కరెక్టు' అని మళ్లీ మాట్లాడకుండా వెళ్లాడు.

గవర్నరుగారు ఎల్లుండి వస్తారు. ఆరోజు మధ్యాహ్నం చీట్లపేకాడటానికి పోతే నాకు చీట్లబదులు చీవాట్లు తగిలినాయి. ఆ నలభై ఏళ్ల అల్లారు ముద్దుబిడ్డ నామూలముగా చెడిపోతున్నాడని ఆవిడ ఉద్దేశ్యం. నేను పాతికేళ్ల పసిపాపని. ఆసంగతి ఆవిడకు తెలియదు. చిట్టెయ్యా ప్రొద్దు గ్రుంకిన తరువాత నన్ను వీధిలో కలుసుకున్నాడు. నన్ను చూచీ చూడనట్లుగా నటించి మారుమొఖంపెట్టి చేతిలో బెత్తంతో గూటు కొట్టుకొంటూ యీలవేస్తూ నిలుచున్నాడు. నేను తాళం ద్రుతం మీద నడుస్తూందని తెలిసికొని దగ్గరకువెళ్లి "గుడ్ బై" అన్నాను. చిట్టెయ్యా ఎడంచేతితోనా 'శాల్యూట్' 'రిటరన్' చేసి యింకోవేపుకు తిరిగి యీల వెయ్యడం మొదలు పెట్టాడు. ఇంకా బతకడం ఎట్లాగురా అనుకొని తిరిగి వెళ్లబోతున్నా, చిట్టెయ్యా మళ్లీ పిలిచాడు. నేనన్నా గదా "ఏమండీ అందరికీ డిన్నర్ పార్టీకి యిన్విటేషన్లు వచ్చాయి. మీకు కూడా వచ్చిందా" అని, చిట్టెయ్యా 'డామ్ యిన్సల్టు' అన్నాడు. గవర్నరుగారు వచ్చారు. రైలుకు పోవడానికికూడా వీలులేకుండా పోలీసువాళ్లు రోడ్లు బిడాయించారు. పిట్టాడితే ఒట్టు. గవర్నరుగారి ప్రోగ్రాం జరుగుతోంది. నాలుగింటికి "డిన్నరు" పార్టీ అమోఘంగా జరుగుతోంది. చిట్టెయ్యా నల్లని సూటువేసి మాంచి క్రాఫుతో వస్తున్నాడు. నేను కనబడటంతోనే "పోదామండీ" అన్నాడు. ఆయన ప్రసన్నత అప్రసన్నత వర్షాకాలపు ఎండలంటివి. వేసవికాలపు వానలంటివి. ఎప్పుడెందునో ఎవరికి తెలుస్తుంది. చీట్లపేకాడేటందుకు కష్టము వస్తుందేమో నని వెంటబడ్డాను. "డిన్నరు" పార్టీ జరిగే తోట గోడదాకా వెళ్లాము. "మీరిక్కడ నిలుచోండి నేను లోపలికి వెళ్లివస్తా"నని తాను వెళ్లాడు. నాకు మనస్సులో తెలుసు ఈయనకు యిన్విటేషను ఎవరు పంపిస్తారని! సరే యీయన్ని కనిపెడదామని నేను. చిట్టెయ్యా గోడమలుపు తిరిగేవరకు నేను వెనక వస్తున్నానేమో నని తిరిగి తిరిగి చూడడం మొదలు పెట్టాడు. నేనూ ఏమీ ఎరగనట్లు అటు మొఖమే పెట్టలేదు. చిట్టెయ్యాకు ధైర్యం కలిగి గేటుదగ్గరకు పోయినాడు. నేనటు తిరిగివచ్చి గేటుదగ్గర జనంలో వెనక అతకిని కనబడకుండా నక్కి ఉన్నాను. చిట్టెయ్యా గేటుదగ్గరకు రావడం, పోలీసువాళ్లు వెళగొట్టడం, అచ్చట నున్నవాళ్లంతా నవ్వడం, చిట్టెయ్యా పరాభవం తినికూడా యీలవేస్తూ అటు యిటు పచారుచెయ్యడం, పిల్లలంతా కేలింతలు కొట్టి నవ్వి గేలిచెయ్యడం అంతా చూచాను. ఇదొక ఘంటసేపు రవధ. ఇక డిన్నరుపార్టీ అయిపోతుందనగా మళ్లీ తీటు తిరిగివచ్చి చిట్టెయ్యా నన్ను వదిలిపెట్టిన చోట వచ్చి నిలుచున్నాను. డిన్నరుపార్టీ అయిపోవడంతోనే ఎవరిదారిని వారు వెళుతున్నారు. చిట్టెయ్యా చేతిరుమాలుతో నోరుతుడుచుకొంటూ నాదగ్గరకు వచ్చాడు. "కలిసి పోదామా" అన్నాడు. "సరే" నన్నాను. కొంత దూరం వచ్చిన తరువాత చిట్టెయ్యా నాతో మొదలు పెట్టాడు. "స్పెన్సరు టీ ఏమి బాగుందండి టీ చేసినా స్పెన్సరువాళ్లు చెయ్యాలి. మనవాళ్లకేమి చేతఅవుతుంది. గవర్నరుగారు నాకు షేకుహాండు యిచ్చారండి. నేను మీతో చెప్పానుగాదు. నేను M. L. C. ని అయితే నాకు ఛీఫ్ మినిస్టరు యిస్తానన్నాడని! వెనక ఎలెక్షనులో స్టాండు అవుదామంటే నాకు జబ్బుజేసింది. మర్యాద అంటే మనకేమి తెలుసునండీ. గవర్నరుగారు ఎంతవాడు. ఎంత వినయం, నాదగ్గరకు వచ్చి షేకుహాండు యిచ్చి

Mr. చిట్టెయ్యా! How do you do, అన్నాడండీ. ఏమి ఆదరణ. మన వెధవాంకి ఏమీ తెలియదండి." ఇట్లా అంటూఉండగా నేను "ఇది డిన్నరుపార్టీయా, టీపార్టీయా" అన్నాను. చిట్టెయ్య "రెండూ ఒకటేనండీ. దొరలలో యిట్లాంటి అల్పపుభేదాలు లేవు. ఇవన్నీ మనవాళ్లు తెచ్చి పెడతారండీ. అసలు వాళ్లు సగము టీ కాఫీలమీదనే బ్రతుకుతారు. మనవాళ్లకుమల్లే గోంగూర పచ్చడి మజ్జిగ, వడియాలు, ఇవా టీమీద? ఏమిటీ! తాగినా స్పెన్సరు టీ తాగాలండి. రోజూ మా అమ్మ చేస్తుంది వెధవ టీ! ఏమి టీ అండీ." నేను నవ్వు ఆపుకోలేక మీ అమ్మగారు వెధవ టీ చేస్తుందా అండి. మీనాయన గారు పోయినతరువాత ననుకుంటా, అదివరకు మంచి టీ చేస్తుండేదనుకుంటాను" అన్నా. చిట్టెయ్య పెద్దడన్ను. నేన్న అన్నమాట తెలిసిందికాదు. "అవునండీ! మాఫాదరు ఉన్నప్పుడు బాగానే చేసేది. ఇప్పుడే వెధవ టీ చేస్తోంది." అన్నాడు. నేను "అవును విచారించవలసిన విషయమే" అన్నాను.


## హస్తరేఖాశాస్త్రము



విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీ, బాలుర సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంబగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంథముచేత ఆయుఃన్ను, వివాహాలాభము, గుణము, శక్తి, బుద్ధి, అదృష్టము, సంతానము, లౌకిక సుఖము, వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము, మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ, మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించి యున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీనీ సామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట యెంతయు సందియంబు లేదు.

దీని వెల 2-0-0.

ఆనందబోధిని ఆఫీసు, సౌకారుపేట మదరాసు.



## జీవామృతము

ఉదయమునుండి సాయంత్రమువరకు కార్యాలయమున పనిచేయు ఉద్యోగికి

కండరములు కరగిపోయే లాగు కర్మాగారముల పనిచేసే కార్మికునకు

గృహకృత్య నిర్వహణము చేయుటలో నడుము వంగిపోవు గృహిణికి

మెదడునకు వేడి బుట్టించు చదువును చదువు విద్యార్థికి

జీవామృతము నమ్మిన బంటు.

జవసత్వములకు, వీర్యవృద్ధికి, బుద్ధి కుశలతకు

జీవామృతము.

## బాలభాస్కర

బిడ్డలకు వచ్చు లివర్ స్ప్లీన్ వ్యాధులను మాన్పు వజ్రాయుధము.

ఆ జబ్బులు రాకుండ కాపాడుటలో నిది రక్షా కవచము.

రెండు సైజులలో దొరకును.

ఆయుర్వేదాశ్రమం

151 గోవిందప్ప నాయకన్ వీధి, మదరాసు.